క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సింహాచలం: విద్యుత్ లైన్ల నిర్వహణ పనులు చేపడుతున్న కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏఈ డీవీఎల్ కుమార్ బుధవారం తెలిపారు. 98వ వార్డులోని సింహపురికాలనీ, పద్మావతినగర్, మైత్రినగర్, జంగాల కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

ఉత్సాహంగా 'మా నమ్మకం నువ్వే జగన్'



దుర్గానగర్‌లో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న సత్తిబాబు

సింహాచలం: జీవీఎంసీ 93వ వార్డు 490 సచివాలయం పరిధిలోని దుర్గానగర్‌లో బుధవారం జగనన్నే మా భవిష్యత్తు...మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. 93వవార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు దాసరి సత్తిబాబు ఇంటింటికీ వెళ్లి గడిచిన నాలుగేళ్లుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అందజేసిన సంక్షేమ పథకాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బాబు, హరి ప్రసాద్, హర్ష, రాజు, నారాయణరావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ హుండీలో రూ.10 వేలు చోరీ



సీసీ కెమెరాలో రికార్డయిన దృశ్యం

సబ్బవరం: మండలంలోని వంగలి సోమలింగేశ్వరస్వామి ఆలయంలోని స్వామివారి హుండీ మంగళవారం రాత్రి చోరీకి గురైంది. ఆలయంలో నాలుగు హుండీలు ఉన్నాయి.బుధవారం ఉదయం ఆలయానికి వెళ్లిన భక్తులు హుండీ చోరీ జరిగిందని గుర్తించి గ్రామ పెద్దలకు సమాచారం ఇచ్చారు. సుమారు రూ.10 వేలు చోరీకి గురైనట్లు కమిటీ సభ్యులు గుర్తించారు. అయితే ఆలయంలో ఉన్న సీసీ కెమెరాను పరిశీలించగా ముఖానికి మాస్కు ధరించి ఉన్న వ్యక్తి హుండీ చోరీ చేసినట్టు రికార్డు అయ్యింది.ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒక్కరోజులో రూ.54 లక్షల ఆస్తిపన్ను వసూలు

గాజువాక : జీవీఎంసీ గాజువాక జోనల్ రెవెన్యూ సిబ్బంది బుధవారం ఒక్కరోజే రూ.57.78 లక్షల ఆస్తిపన్నును వసూలు చేశారు. 2023–24 ఆర్థిక సంవత్సర ఆస్తిపన్ను మొత్తం చెల్లించినవారికి ప్రభుత్వం అమలు చేస్తున్న ఐదు శాతం డిస్కౌంట్‌తో పన్ను వసూళ్లలో ప్రగతి సాధిస్తునారు. అందులో భాగంగా హిందూస్తాన్ జింక్ కర్మాగారం రూ.54,06,251ను జీవీఎంసీకి చెల్లించింది. ఈ మొత్తానికి చెందిన చెక్కులను ఆ సంస్థ ప్రతినిధి గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలంకు అందజేశారు. 74వ వార్డులోని మదర్సా నిర్వాహకులు రూ.3.69 లక్షల ఆస్తి పన్నును చెల్లించారు. ఒక్కరోజులో మొత్తం రూ.57.78 లక్షలు వసూలైనట్టు జెడ్సీ పేర్కొన్నారు. ఈ నెలలో ఐదు శాతం డిస్కౌంట్ అమల్లోకి వచ్చిన తరువాత 19,202 అసెస్‌మెంట్ల నుంచి మొత్తం రూ.14.92 కోట్లు వసూలైంది. దీనిపై జోనల్ రెవెన్యూ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆర్వోలు సీహెచ్.రామనారాయణ, శ్రీకాంత్‌లను జోనల్ కమిషనర్ ఈ సందర్భంగా అభినందించారు.

'ప్రజా సంఘాలకు అవకాశం ఇవ్వాలి'

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ ఆవరణలో నిర్వహించిన సర్వీస్ ఇంప్రూవ్‌మెంట్ గ్రూప్ (ఎస్ఐజీ) సమావేశంలో ప్రయాణికులు, ప్రజా సంఘాలకు ప్రాతినిధ్యం లేకపోవడం దారుణమని సభ్యులు అభిప్రాయం వ్యక్తం చేశారు. రైల్వే యూజర్స్ అసోసియేషన్ అభ్యర్థన మేరకు ప్రతీ మూడు మాసాలకు ఒకసారి ఎస్ఐజీ సమావేశం ఏర్పాటు చేయాలని గతంలో నిర్ణయించారు. డీసీఎం అవినాష్, స్టేషన్ మేనేజర్ ఎస్.ఆర్.కె.రావు ఆధ్వర్యంలో ఎస్ఐజీ సమావేశం నిర్వహించారు. ప్రయాణికుల అభిప్రాయాలు తీసుకోవాలన్నారు.

ఇంటర్‌లో మెరిసిన గురుకులం



నిరంజన్ కుమార్ (ఎంపీసీ) 451



పి.రాకేష్ (ఎంపీసీ)447



కర్రి శ్రావణ్‌కుమార్ (బైపీసీ)420



కొల్లి జయరామ్ (ఎంపీసీ) 973



హేమంత్‌కుమార్ (ఎంపీసీ)962



ఎన్‌వీవీఆర్ కిషోర్ (బైపీసీ)965



జి.షానిత్ (బైపీసీ)948



కిల్లొ దావీద్ (సీఈసీ)885



పృథ్వీసాయికుమార్ (ఎంఈసీ)969



క్షమాత్మికరం (ఎంఈసీ) 942



కె ప్రసన్న (ఎంఈసీ)942



కె. జీవన్ (సీఈసీ) 845



డి. అర్జున్ (సీఈసీ) 439



మీనాక్షి (ఎంపీసీ) 980



రాములమ్మ (బైపీసీ) 977



భాగ్య (ఎంఈసీ) 976



పద్మనాగలక్ష్మి (సీఈసీ) 967

సింహాచలం: ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో గురుకుల విద్యార్థులు మెరిశారు. మిగిలిన కళాశాల కంటే మెరుగైన ఫలితాలు సాధించారు. సింహాచలంలోని మహాత్మా జ్యోతిబాపూలే ఏపీ బీసీ గురుకుల కళాశాల నుంచి ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ నుంచి 41 మంది హాజరు కాగా 34మంది, బైపీసీ నుంచి 26 మందికి 22 మంది, సీఈసీ నుంచి 17మందికి 13మంది ఉత్తీర్ణులయ్యారు.

ద్వితీయ సంవత్సరంలో...

ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీ నుంచి 48 మందికి 42 మందికి, బైపీసీ నుంచి 32 మందికి 25, సీఈసీ నుంచి 12 మందికి 10, ఎంఈసీ నుంచి 14 మందికి 10 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ దాసరి సత్యారావు తెలిపారు. కాగా ప్రథమ సంవత్సరం ఎంపీసీలో ఆర్. నిరంజన్ కుమార్ 451 మార్కులు, పి.రాకేష్ 447మార్కులు, ప్రథమ సవంత్సరం బైపీసీలో కర్రి శ్రావణ్‌కుమార్ 420 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో కొల్లి జయరామ్ 973 మార్కులు, పెదపూడి హేమంత్‌కుమార్ 962 మార్కులు, ద్వితీయ సంవత్సరం బైపీసీలో ఎన్‌వీవీఆర్ కిషోర్ 965 మార్కులు, జి.షానిత్ 948 మార్కులు , ద్వితీయ సంవత్సరం సీఈసీలో కిల్లో దావీద్ 885మార్కులు, ద్వితీయ సంవత్సరం ఎంఈసీలో జి.పృథ్వీసాయి కుమార్ 969 మార్కులు సాధించారు.

సబ్బవరంలో..

సబ్బవరం: సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు రెగ్యులర్ గ్రూపుల నుంచి 115 మంది విద్యార్థులు హాజరు కాగా 47 మంది ఉత్తీర్ణులయ్యారు. కాగా 40.87 ఉత్తీర్ణత శాతం నమోదయ్యింది. ప్రథమ సంవత్సరం నుంచి 81 మంది హాజరు కాగా 34 మంది ఉత్తీర్ణులయ్యారు. 41.98 ఉత్తీర్ణత శాతం నమోదయ్యింది. ద్వితీయ సంవత్సరంలో 161 మంది ఒకేషనల్ విద్యార్థులు హాజరు కాగా 94 మంది ఉతీర్ణులయ్యారు. 58.39 ఉత్తీర్ణత శాతం నమోదైనట్లు ప్రిన్సిపాల్ మురళీధర్ తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో ఎస్. యోగినీ ప్రియాంక 943/1000 మార్కులు సాధించగా, బైపీసీ నుంచి సీహెచ్ లాశ్య 955/1000, ఎంపీహెచ్‌డబ్ల్యూ నుంచి కె. లలిత 946/1000 మార్కులు సాధించారని చెప్పారు.

- సబ్బవరం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ద్వితీయ సంవత్సరంలో 85 శాతం ఉత్తీర్ణత సాధించగా,ప్రథమ సంవత్సరంలో 86 శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ కె. విజయకుమార్ తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో 47 మందికి గానూ 40 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వీరిలోఎంఈసీ నుంచి జి. క్షామత్మికరమ్ 942/1,000, ఎంఈసీ నుంచి కె. ప్రసన్న 942/1000 మార్కులు సాధించగా, కె. జీవన్ కుమార్ సీఈసీలో 845/1000 మార్కులు సాధించారు. కాగా ప్రథమ సంవత్సరంలో 21 మందికి గానూ 18 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో సీఈసీ నుంచి డి. అర్జున్ 439/500, ఎంఈసీ నుంచి జి. ప్రవీణ్ 383/500 మార్కులు సాధించారు.

కేజీబీవీలో..

కేజీబీవీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 71 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎస్‌వో మృదుల తెలిపారు. 34 మంది విద్యార్థులు హాజరు కాగా 24 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో కె. అంజనీ 423/440 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచినట్లు ఆమె తెలియజేశారు.

తానాంలో90 శాతం ఉత్తీర్ణత

పరవాడ: తానాం గురుకుల జూనియర్ కళాశాల నుంచి ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 112 మంది పరీక్షలకు హాజరు కాగా 90 మంది ఉత్తీర్ణత సాధించారు. అలా గే సెకెండ్ ఇయర్‌లో 127 మందికి 123 మంది ఉత్తీర్ణత సాధించారని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అప్పలనాయుడు చెప్పారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో కళాశాలకు చెందిన మీనాక్షి 980/1000 మార్కులు సాధించింది. బైపీసీలో రాములమ్మ అనే విద్యార్థి 977/1000 మార్కులు సాధించగా ఎంఈసీలో వి.భాగ్య 976/1000, సీఈసీలో పద్మనాగలక్ష్మి 967/1000 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారని ప్రిన్సిపాల్ అప్పలనాయుడు తెలిపారు.

ట్రస్ట్ బోర్డు సభ్యులంటే అశోక్‌కు లెక్క లేదు

సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యురాలు పంచాడి పద్మ



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులంటే చైర్మన్ పూసపాటి అశోక్ గజపతిరాజుకు గౌరవం లేదని దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యురాలు పంచాడి పద్మ ఆరోపించారు. సింహగిరిపై ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడారు. బోర్డు సమావేశాల్లో చైర్మన్ మాటతీరు వెటకారంగా ఉంటుందన్నారు. అసలు ఏరోజూ ఆయన దేవస్థానం అభివృద్ధి గురించి పట్టించుకోలేదన్నారు. దర్శనానికి వచ్చి వెళ్లడమే తప్పా దేవస్థానం గురించి ఆలోచించారా అని ప్రశ్నించారు. పైగా నేర చరిత్ర ఉన్న వారికి ఆలయాల్లో పదవులు ఇచ్చారని ఆయన విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఈనెల 23న జరిగిన చందనోత్సవంలో గిరిజన మహిళ అయిన నేను ట్రస్ట్‌బోర్డు సభ్యురాలు హోదాలో దర్శనానికి వచ్చినప్పుడు పోలీసులు ప్రవర్తించిన తీరు దుర్మార్గంగా ఉందన్నారు. ఈవిషయంపై కనీసం దేవస్థానం చైర్మన్ అశోక్‌గజపతిరాజు స్పందించలేదన్నారు. రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్య సిబ్బంది, గ్రామ పెద్దలు

సబ్బవరం: మండలంలోని బోదువలసలో సర్పంచ్ నేబర్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. అనిల్ నీరుకొండ ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఎంపీపీ బోకం సూర్యకుమారి,జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు ప్రాంభించారు. బోదువలస,ఎల్లుప్పి ,మర్రిపాలెం తదితర గ్రామాల నుంచి వచ్చిన 195 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 30 మందికి కంటి ఆపరేషన్లు అవసరమవుతాయని గుర్తించారు. వీరందరికీ ఉచితంగా కంటి శస్త్రచికిత్స చేస్తామని ఆస్పత్రి పీఆర్వో రాము తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కొట్యాడ కృష్ణ, కంచిపాటి రాంబాబు, కోన బండయ్య,డాక్టర్లు ప్రశాంత్,మౌనిక,సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సింహాచలం: సింహాచలంలోని మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలో 2023–24 విద్యా సంవత్సరంలో ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ దాసరి సత్యారావు తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మే 18వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మే 28న ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. జూన్ 6న ఫలితాలు విడుదలవుతాయని తెలిపారు. జూన్ 14 నుంచి 17వతేదీ వరకు కౌన్సెలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు.

రిజర్వేషన్ వివరాలు

బీసీ–ఎకి 20శాతం, బీసీ–బికి 28శాతం, బీసీ–సీకి 3శాతం, బీసీ–డీకి 19శాతం, బీసీ–ఈకి 4శాతం, ఎస్‌సీ–15శాతం, ఎస్టీ–6శాతం, ఈబీసీ–2శాతం

ఉత్తరాంధ్ర జిల్లాల విద్యార్థులు అర్హులు

సింహాచలం గురుకుల కళాశాలలో సీటు కోసం ఎంట్రన్స్ రాయడానికి ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం,విశాఖపట్నం జిల్లాలకు చెందిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు.

పరీక్ష ఫీజు: రూ. 250

దరఖాస్తు చేసుకునే వెబ్‌సైట్‌: apcfss.in/MJPAPBCWR

సీట్లు వివరాలు

గ్రూపు	సీట్లు
ఎంపీసీ	60
బైపీసీ	40
సీఈసీ	40

జిల్లా ప్రధాన న్యాయమూర్తికి సత్కారం



న్యాయమూర్తి గుత్తుల గోపిని సత్కరిస్తున్న స్మార్ట్‌సిటీ కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ సభ్యులు

ఎంవీపీ కాలనీ: బదిలీపై వెళ్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుత్తుల గోపి, డీఎల్ఎస్ఏ జడ్జి కేవీవీ బులికృష్ణను ఎంవీపీ కాలనీలోని స్మార్ట్‌సిటీ కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఆవరణలో బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా కౌన్సిల్ కార్యదర్శి పేర్ల భాస్కరరావు మాట్లాడుతూ జిల్లాకు వారు అందించిన విశిష్ట సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు పీకే లింగేశ్వరరావు, రమేష్ చంద్రజైన్, న్యాయవాది పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

7న అల్లూరి వర్ధంతి కార్యక్రమాలు



అల్లూరి వర్ధంతి పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వ విద్యాలయం, తెలుగు విభాగం, సమైక్య భారతి సంయుక్త ఆధ్వర్యంలో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. వచ్చే నెల 7న సాయంత్రం 5 గంటలకు ఆర్కే బీచ్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహం ఎదురుగా స్వాతంత్ర్య సమరయోధుల మైదానంలో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పోస్టర్ ఆవిష్కరణలో స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా ఇండిపెండెంట్ డైరెక్టర్ ఎస్.కాశీ విశ్వనాథరాజు, తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్ర అప్పారావు, సమైక్య భారతి జాతీయ సమన్వయకర్త పి.కన్నయ్య, ఆహ్వాన సంఘం అధ్యక్షుడు బూసి వెంకటస్వామి పాల్గొన్నారు.

- అనంతరం తెలుగు విభాగం సమావేశ మందిరంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆహ్వాన సంఘం అధ్యక్షులు డాక్టర్ బూసి వెంకటస్వామి, సమైక్య భారతి జాతీయ సమన్వయకర్త కన్నయ్య మాట్లాడుతూ అల్లూరి శత వర్ధంతి సందర్భంగా మే 7న దసపల్లా హిల్స్‌లో గాంధీ పార్క్ వద్ద ఉదయం 10 గంటలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు తెలిపారు. సాయంత్రం నిర్వహించే సమావేశం అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అన్నంశెట్టి ఈశ్వరమ్మ, డాక్టర్ పెండ్యాల లావణ్య, శ్రీ ఆతుకూరి వెంకటేశ్వర్లు(యోగి), తదితరులు పాల్గొన్నారు.


కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై ప్రజా వ్యతిరేకత



దీక్ష శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్న వారి సంఖ్య నానాటికీ పెరుగుతోందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయానికి ప్రజామోదం లేదనడానికి ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతే ప్రత్యక్ష నిదర్శనమని పేర్కొన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షల్లో 804వ రోజు బుధవారం అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని, సంఘీభావం తెలిపారు. విశాఖ ఉక్కు ప్రభుత్వరంగంలోనే కొనసాగుతుందని ప్రధాని నరేంద్రమోదీ స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

60 ఏళ్లు దాటిన డీఎస్సీ-98 అభ్యర్థుల ఆందోళన



డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న 1998 డీఎస్సీ అభ్యర్థులు

ఆరిలోవ: డీఎస్సీ–1998లో క్వాలిఫైడ్ అయి 60 సంవత్సరాలు దాటిన వారు తమకు న్యాయం చేయాలని కోరుతూ బుధవారం డీఈవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. 1998లో క్వాలిఫై అయిన తర్వాత ఇంత వరకు ఖాళీగా ఉన్నామని, ఇప్పుడు 60 సంవత్సరాలు దాటిపోవడంతో అర్హులుగా గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో 60 ఏళ్లు దాటిన క్వాలిఫైడ్ అభ్యర్థులు 40 మంది ఉన్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఈవో కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో అభ్యర్థులు బి.సత్యనారాయణ, బి.వెంకటరమణ, టి.రామకృష్ణ, పి.ధర్మారాజు, కె.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ట్రస్ట్‌బోర్డు సమావేశం నిర్వహించాలని వినతి



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న ట్రస్ట్‌బోర్డు సభ్యులు

సింహాచలం: ఈనెల 23న నిర్వహించిన చందనోత్సవంలో చోటు చేసుకున్న సంఘటనలపై చర్చించడానికి అత్యవసరంగా ట్రస్ట్‌బోర్డు సమావేశం నిర్వహించాలని వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయ సూపరింటెండెంట్‌కు ట్రస్ట్‌బోర్డు సభ్యులు వినతి పత్రం అందజేశారు. మహిళా ట్రస్టీ పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు సరిగ్గా లేదని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. ట్రస్ట్‌బోర్డు సమావేశం నిర్వహించి చందనోత్సవం రోజు చోటు చేసుకున్న ఘటనలపై చర్చించి ఉన్నతాధికారులకు నివేదిక పంపించాలని పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్, సంపంగి శ్రీనివాసరావు, దొడ్డి రమణ, పిల్లా కృష్ణామూర్తిపాత్రుడు, వంకాయల సాయినిర్మల, సువ్వాడ శ్రీదేవి, పెనుమత్స శ్రీదేవివర్మ, ఆర్.సతీష్, పంచాడి పద్మ ఉన్నారు.

ద్విచక్ర వాహనానికి నిప్పు పెట్టిన దుండగుడు



ద్విచక్రవాహనాన్ని కాల్చేందుకు యత్నిస్తున్న దుండగుడు(సీసీటీవీ దృశ్యం)

గోపాలపట్నం: పార్కింగ్ చేసి ఉన్న ద్విచక్ర వాహనానికి దుండగుడు నిప్పు పెట్టిన ఘటన ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ పరిధి జాకీర్ హుస్సేన్‌నగర్‌లో చోటు చేసుకుంది. ఎయిర్ పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానికంగా వెల్డింగ్ పనులు చేసుకునే షేక్ మదీనా వలి అనే వ్యక్తి మంగళవారం రాత్రి ఇంటి వద్ద ద్విచక్రవాహనం పార్క్ చేసుకున్నాడు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. మంటల్ని గుర్తించిన స్థానికులు వెంటనే అదుపు చేశారు. కాలనీలో ఉన్న సీసీ ఫుటేజీలు పరిశీలించగా గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్రవాహనంపై పెట్రోల్ పోసి నిప్పంటించినట్లు గుర్తించారు. కాలి పోయిన వాహనం పక్కనే ఉన్న కొన్ని వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎయిర్‌పోర్టు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించి నిందితుడిని గుర్తించే పనిలో పడ్డారు.

కాంట్రాక్టు కార్మికుల నిరసన



ఎన్టీపీసీ మెయిన్‌గేటు వద్ద ధర్నా చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికులకు డస్ట్ అలవెన్స్ పెంచుతూ వెంటనే అగ్రిమెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. డస్ట్ అలవెన్స్ పెంచాలని కోరుతూ కాంట్రాక్టు కార్మికులు బుధవారం ఎన్టీపీసీ మెయిన్ గేటు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ డస్ట్ అలవెన్స్ సమస్య ఏళ్ల తరబడి పెండింగ్‌లో పెట్టడడం దుర్మార్గమన్నారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మెడికల్ టెస్ట్‌ల పేరుతో వేధింపులకు గురి చేయడం, విధులను నిలిపివేయడం అన్యాయమన్నారు. కార్మికులను యాజమాన్యం చులకనగా చూస్తుందని మండిపడ్డారు. ఎన్టీపీసీలో ఉన్న అన్ని యూనియన్లతో సమావేశం ఏర్పాటు చేసి డస్ట్ అలవెన్స్ సమస్యను పరిష్కరించాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు పి.పి.నాయుడు, ఉపాధ్యక్షుడు పి.గోవిందరాజు, వి.అప్పారావు, బి.కన్నంనాయుడు, ఎం.లోవరాజు, కె.సన్నిబాబు పాల్గొన్నారు.

అప్పన్న నిత్య కల్యాణం పునఃప్రారంభం



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణం బుధవారం నుంచి పునః ప్రారంభమైంది. స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలు, చందనోత్సవం సందర్భంగా సుమారు 25రోజులపాటు నిత్యకల్యాణాన్ని నిలిపి వేసిన విషయం తెలిసిందే. దీంతో బుధవారం నుంచి నిత్యకల్యాణాన్ని పునరుద్ధరించారు. ఆలయ ఆ స్థానమండపంలో ఉదయం 9.30 నుంచి స్వామికి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ అర్చకులు పెద్దరాజు, శ్రీకాంత్ తదితరులు కల్యాణం నిర్వహించారు.

భవిష్యత్ సంపదగా మేధో హక్కులు

- ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ శ్రీనివాసరావు
- ఏయూలో ఘనంగా ఐపీఆర్ దినోత్సవం
- పేటెంట్‌లు సాధించిన మహిళలకు సత్కారం



వర్సిటీ నుంచి పేటెంట్ సాధించిన డాక్టర్ అపరంజిని సత్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: భవిష్యత్ తరాలకు నిజమైన సంపదగా మేధో హక్కులు నిలుస్తాయని ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు అన్నారు. ఆంధ్ర విశ్వ విద్యాలయం వ్యవస్థాపక దినోత్సవంలో భాగంగా రసాయన శాస్త్ర విభాగం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రపంచ మేధో హక్కుల వేడుకల్లో ఆయన మాట్లాడారు. మనం సాధించిన పేటెంట్లను కమర్షియల్ చేయడం ఎంతో అవసరమన్నారు. తద్వారా సంపదను సృష్టించడం సాధ్యపడుతుందని, ఈ దిశగా ఆవిష్కర్తలు ఆలోచన చేయాలని సూచించారు. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం నూతన ఆవిష్కరణలకు, దేశీయంగా ఉత్పత్తిని పెంచడానికి అవసరమైన సహకారం అందిస్తోందన్నారు. పేటెంట్‌తో పాటు బ్రాండింగ్, ట్రేడ్ మార్క్ వంటివి చాలా అవసరమన్నారు. ప్రస్తుతం తమ ప్రతిభతో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. శాస్త్రీయ ఆవిష్కరణలు, పేటెంట్‌లు సాధించడంలో ప్రతిభ చూపుతున్నారన్నారు. ఎన్ఎస్‌టీఎల్ సైతం తన ప్రస్థానాన్ని ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ప్రారంభించిందని గుర్తు చేశారు.

ఏయూ ఐపీఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం మాట్లాడుతూ ఐపీఆర్‌పై యువతలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. దేశ ఆర్థిక ప్రగతి ఐపీఆర్‌పై ఆధారపడి ఉంటుందన్నారు. ఇప్పటికే ఏయూ తరఫున 70 పేటెంట్లకు దరఖాస్తు చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం మహిళలను అన్ని రంగాలలో ప్రోత్సహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఇంక్యుబేషన్ సెంటర్ సీఈవో రవి ఈశ్వరపు, ఆచార్య శ్యామల తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏయూ నుంచి పేటెంట్‌లు సాధించిన డాక్టర్ చందన లక్ష్మి, డాక్టర్ అపరంజిలను సత్కరించారు.

స్టీల్ బీఎంఎస్ ధర్నా

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బీఎంఎస్ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేశారు. బీఎంఎస్ జాతీయ మహాసభలో తీసుకున్న నిర్ణయం మేరకు దేశవ్యాప్తంగా నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ఉదయం ఉక్కు అడ్మిన్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడారు. కార్మికులందరికీ సామాజిక సురక్ష కల్పించాలని, కాంట్రాక్ట్ కార్మిక వ్యవస్థను రద్దు చేసి కాంట్రాక్ట్ లేబర్ రెగ్యులేషన్ అండ్ అబాలిషన్ చట్టం 1970ని మార్పు చేయాలని కోరారు. ఆర్థిక వికాసం కోసం నేషనల్ లేబర్ పాలసీని ఏర్పాటు చేయాలని, కనీస వేతనాల స్థానంలో జీవించే వేతనం (లివింగ్ వేజెస్) ఇచ్చే విధంగా చట్టంలో మార్పు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎంఎస్ జిల్లా కార్యదర్శి రాందాస్ నరేంద్ర, స్టీల్ బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి ఎస్. రాధాకృష్ణన్, కొమ్మినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.